

## తొలి ఎత్తు లిరెన్‌దే

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఓటమితో ఆరంభించాడు. సోమవారం సింగపూర్ వేదికగా మొదలైన ఈ మెగా ఈవెంట్ తొలి గేమ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)దే పైచేయి అయింది. గంటా 20 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో లిరెన్.. 42 ఎత్తుల్లో గుకేశ్‌ను ఓడించాడు. నల్లపావులతో బరిలోకి దిగిన అతడి ఖాతాలో ఒక పాయింట్ దక్కింది. మొత్తం 14 గేమ్‌లు ఉండే ఈ టోర్నీలో 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడు ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తాడు.

## 7 రన్స్‌కే ఆలౌట్

లాగోస్ (నైజీరియా): అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఆఫ్రికా దేశం ఐవరీ కోస్ట్.. ఏడు పరుగులకే ఆలౌట్ అయి అత్యంత చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ సబ్ రీజియన్ ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో భాగంగా నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 7 రన్స్‌కే కుప్పకూలింది. మొదట బ్యాటింగ్ చేసిన నైజీరియా నిర్ణీత ఓవర్లలో 271/4 పరుగుల భారీ స్కోరు చేసింది.

## మళ్లీ అగ్రస్థానానికి టీమ్‌ఇండియా

దుబాయ్: పెర్త్ టెస్టులో ఘనవిజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. స్వదేశంలో కివీస్‌తో సిరీస్‌ను 0-3తో కోల్పోయిన భారత్.. డబ్ల్యూటీసీ టేబుల్‌లో రెండో స్థానానికి పడిపోయిన విషయం తెలిసిందే. అయితే తాజా విజయంతో భారత్.. 61.11 శాతంతో తిరిగి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా (57.69 శాతం), శ్రీలంక (55.56 శాతం) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ సైకిల్‌లో భారత్ 15 టెస్టులాడి 9 విజయాలు ఐదింట్లో ఓడి ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

# భళా భారత్

### పెర్త్ టెస్టులో చరిత్రాత్మక విజయం • ఆసీస్‌పై 295 పరుగుల భారీ తేడాతో గెలుపు

### సిరాజ్, బుమ్రా ధాటికి తోకముడిచిన కంగారూలు • సిరీస్‌లో 1-0 ఆధిక్యం

**బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. పెర్త్ టెస్టులో మూడో రోజే గెలుపు బాటలు వేసుకున్న బుమ్రా సేన.. నాలుగో రోజు పెద్దగా కష్టపడకుండానే 295 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాను మట్టికరిపించి చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. 534 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు నాలుగో రోజు క్రీజులోకి వచ్చిన కంగారూలు.. బుమ్రా నేతృత్వంలోని భారత పేస్ దళం దూకుడుకు తోకముడవక తప్పలేదు. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ ఎదురుదాడికి దిగాలని చూసినా వాళ్ల పోరాటం భారత విజయాన్ని కాస్త ఆలస్యం చేసిందంతే. సిరాజ్, హర్షిత్, వాషింగ్టన్ క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది.**



పెర్త్: ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ చరిత్రాత్మక విజయం సాధించింది. 534 పరుగుల భారీ ఛేదనలో ఆట నాలుగో రోజు ఆస్ట్రేలియా 58.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌట్ అవడంతో 295 పరుగుల భారీ తేడాతో టీమ్‌ఇండియా ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. పరుగుల పరంగా ఆస్ట్రేలియాలో భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. మూడోరోజే పెర్త్ టెస్టును తన నియంత్రణలోకి తెచ్చుకున్న బుమ్రా సేన.. నాలుగో రోజూ అదే జోరును కొనసాగించింది. సారథి జస్‌ప్రీత్ బుమ్రా (3/42), మహ్మద్ సిరాజ్ (3/51), స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (2/48), హర్షిత్ రాణా (1/69) ధాటికి కంగారూలు తోక ముడవక తప్పలేదు. ట్రావిస్ హెడ్ (101 బంతుల్లో 89, 8 ఫోర్లు) ఎదురుదాడికి దిగినా అతడితో పాటు మిచెల్ మార్ష్ (47), అలెక్స్ కేరీ (36) పోరాటం భారత విజయాన్ని అడ్డుకోలేకపోయింది. మ్యాచ్‌లో బంతితో మెరిసిన బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. రెండో టెస్టు వచ్చే నెల 6 నుంచి అడిలైడ్ వేదికగా జరుగనుంది.



బుమ్రా (3/42)

### కంగారెత్తించిన మియా



హెడ్ (89)

ఓవర్ నైట్ స్కోరు 12/3తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఆసీస్‌ను హైదరాబాదీ పేసర్ సిరాజ్ ఆరంభంలోనే కంగారెత్తించాడు. తాను వేసిన తొలి ఓవర్‌లోనే మి యా.. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (4)ను బోల్తా కొట్టించాడు. సిరాజ్ బంతిని పుల్ షాట్ ఆడబోయిన ఖవాజా నియంత్రణ కోల్పోయి వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఈ క్రమంలో స్మిత్ (17)కు హెడ్ జతకలిసి ఆసీస్ స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. భారత బౌలర్లపై కౌంటర్ ఎటాక్‌కు దిగిన హెడ్.. క్రీజులో కుదురుకున్న తర్వాత మరింత దూకుడు పెంచాడు. మరో ఎండ్‌లో స్మిత్ వికెట్ కాపాడుకునేందుకు యత్నించాడు. 60 బంతులెదుర్కొన్న అతడు.. లంచ్ విరామానికి 5 ఓవర్ల ముందు సిరాజ్ బౌలింగ్‌లో పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 62 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### బుమ్రా మ్యాజిక్..

స్మిత్ నిష్క్రమించినా మార్ష్ అండతో హెడ్ రెచ్చిపోయాడు. మార్ష్ కూడా దూకుడుగా ఆడటంతో ఆసీస్ స్కోరు వేగం పెరిగింది. లంచ్‌కు ముందే అర్ధ సెంచరీ పూర్తిచేసిన హెడ్ సెంచరీ దిశగా వేగంగా సాగాడు. ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ జోడీని విడదీయడానికి స్వయంగా బుమ్రానే బరిలోకి దిగాడు. అతడు వేసిన 39వ ఓవర్లో హెడ్.. పంత్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆసీస్ పరాజయం ఖరారైంది. ఆరో వికెట్‌కు హెడ్, మార్ష్ కలిసి 87 బంతుల్లోనే 82 పరుగులు జోడించారు. హెడ్ ఔట్ అయిన కొద్దిసేపటికి తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి బౌలింగ్‌లో మార్ష్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. టీ విరామానికి ముందే స్టార్క్ (12)ను.. తర్వాత లయాన్‌ను వాషింగ్టన్ సుందర్ పెవిలియన్‌కు పంపాడు. రాణా బౌలింగ్‌లో కేరీ క్లీన్‌బౌల్డ్ అవడంతో పెర్త్‌లో భారత్ విజయం సాధించింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150 ఆలౌట్;
ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 104 ఆలౌట్;
భారత్ రెండో ఇన్నింగ్స్: 487/6 డిక్లేర్డ్
ఆసీస్ రెండో ఇన్నింగ్స్: 238 ఆలౌట్ (హెడ్ 89, మార్ష్ 47, బుమ్రా 3/42, సిరాజ్ 3/51)

### బుమ్రా ఘనత

**8** టెస్టులు
**40** వికెట్లు
**18.80** సగటు

*1950 తర్వాత ఆస్ట్రేలియాలో టెస్టులు ఆడుతూ కనీసం 30 టెస్టు వికెట్లు తీసిన వంద మంది బౌలర్లలో కివీస్ దిగ్గజం సర్ రిచర్డ్ హ్యాడ్లీ (17.83) తర్వాత అత్యుత్తమ సగటు బుమ్రాదే.*

**1** ఆస్ట్రేలియాపై ఆస్ట్రేలియాలో పరుగుల పరంగా భారత్‌కు పెర్త్ విజయమే అతి పెద్ద గెలుపు. మెల్‌బోర్న్ వేదికగా 1977లో 222, 2018లో 137 రన్స్ తేడాతో గతంలో గెలిచింది. ఓవరాల్‌గా ఆసీస్‌పై మోహాలీ (320) తర్వాత ఆ దేశంపై ఇది రెండో భారీ విజయం.

**2** ఆసియా ఆవల భారత్‌కు ఇది రెండో (పరుగుల పరంగా) అతిపెద్ద విజయం. 2019లో విండీస్‌పై నార్త్ సౌండ్‌లో 318 రన్స్ తేడాతో గెలవడమే ఇప్పటి దాకా అత్యుత్తమం.

పెర్త్‌లో ఆసీస్‌తో టెస్టు ఆడుతూ గెలిచిన రెండో ఆసియా సారథి బుమ్రా. తొలిస్థానం కుంబ్లేది.

**4** టెస్టులలో భారత సారథుల అత్యుత్తమ ప్రదర్శనలలో బుమ్రాది (8/72) నాలుగో స్థానం. కపిల్ దేవ్ (10/135 వెస్టిండీస్‌పై), బిషన్ సింగ్ బేడి (10/194 ఆసీస్‌పై, 9/70 కివీస్‌పై) బుమ్రా కంటే ముందున్నారు.

# భువీకి జాక్‌పాట్

### ముగిసిన ఐపీఎల్ వేలం

### భారత బౌలర్లపై కాసుల వర్షం

### దీపక్ చాహర్, ముకేశ్, ఆకాశ్ దీప్‌కు భారీ ధర

### 13 ఏండ్ల బీహార్ కుర్రాడికి కోటి



జెడ్డా: తొలి రోజు మాదిరిగానే రెండో రోజూ ఐపీఎల్ వేలంలో ఫ్రాంచైజీలు కీలక ఆటగాళ్లపై కాసులు కుమ్మరించాయి. భారత వెటరన్ పేసర్, గత సీజన్ దాకా సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన భువనేశ్వర్ కుమార్ రెండో రోజు వేలంలో అత్యధిక ధరను దక్కించుకున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అతడిని రూ. 10.75 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. రెండో రోజు రూ. 10 కోట్ల మార్కును దాటిన ఏకైక క్రికెటర్ భువీనే. అతడితో పాటు టీమ్‌ఇండియా బౌలర్లు దీపక్ చాహర్ (రూ. 9.25 కోట్లు - ముంబై), ముకేశ్ కుమార్ (రూ. 8 కోట్లు- ఢిల్లీ), ఆకాశ్ దీప్ (రూ. 8 కోట్లు- లక్నో) భారీ ధర పలికారు. ఎవరూ ఊహించని విధంగా సౌతాఫ్రికా పేస్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్‌ను పంజాబ్ కింగ్స్ రూ. 7 కోట్ల ధరతో దక్కించుకోగా ముంబై పేసర్ తుషార్ దేశ్‌పాండే కోసం రాజస్థాన్ 6.50 కోట్లు వెచ్చించింది. ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాను రూ. 5.75 కోట్లతో ఆర్సీబీ సొంతం చేసుకోగా కేకేఆర్ మాజీ స్పిన్ ఆల్‌రౌండర్ నితీశ్ రాణాను రాజస్థాన్ రూ. 4.20 కోట్లకు కొనుగోలు చేసింది. వాషింగ్టన్ సుందర్ రూ. 3.20 కోట్లతో గుజరాత్ తీసుకుంది. ఆక్షన్ తొలి రోజు అమ్ముడుపోని డేవిడ్ వార్నర్‌ను రెండో రోజూ ఫ్రాంచైజీలు పట్టించుకోకపోగా దేవ్‌దత్ పడిక్కల్ ఎట్టకేలకు తిరిగి ఆర్సీబీ గూటికి (రూ. 2 కోట్లు) చేరాడు.

**మొత్తం 204 స్లాట్స్ కోసం 577 మంది క్రికెటర్లు తమ పేర్లు నమోదుచేసుకోగా రెండు రోజుల్లో 182 మంది ప్లేయర్ల (62 మంది ఓవర్సీస్ ఆటగాళ్ల)ను పది ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి. వీరిపై ఆయా జట్లు కలిసి ఖర్చు చేసిన మొత్తం రూ. 639.15 కోట్లు.**

### భువీ సొంతగూటికి..


2009లో ఆర్సీబీ తరపునే (చాంపియన్స్ లీగ్) ఎంట్రీ ఇచ్చిన భువీని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు బెంగళూరు చాకచక్యంగా వ్యవహరించింది. రూ. 30.65 కోట్ల భారీ పర్స్‌తో రెండో రోజు వేలంలోకి వచ్చిన ఆర్సీబీ.. ఆరంభంలో భువీని పట్టించుకోలేదు. సన్‌రైజర్స్ వద్దనుకున్న భువీ కోసం ముంబై, లక్నో పోటీ పడ్డాయి. కానీ అనూహ్యంగా రేసులోకి వచ్చిన బెంగళూరు.. భారీ ధరకు అతడిని దక్కించుకుంది.

### ప్రియాన్ష కోసం పోటాపోటీ



కొద్దిరోజుల క్రితం ముగిసిన ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మెరుపులు మెరిపించిన యువ సంచలనం ప్రియాన్ష ఆర్య కోసం ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. అలవోకగా సిక్సర్లు బాదే ఈ కుర్రాడి కోసం ఆర్సీబీ, ఢిల్లీ, పంజాబ్ పోటాపోటీగా బిడ్ వేశాయి. కానీ చివరికి పంజాబ్.. రూ. 3.6 కోట్ల ధరతో అతడిని దక్కించుకుంది.

### 13 ఏండ్ల కుర్రాడి కోసం..



ఎవరూ ఊహించని విధంగా బీహార్‌కు చెందిన 13 ఏండ్ల వైభవ్ సూర్యవంశీ.. వేలంలో రూ. 1.10 కోట్లు దక్కించుకున్నాడు. 13 ఏండ్ల 243 రోజుల వయసున్న వైభవ్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పోటీ పడ్డాయి. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడిని చివరికి రాజస్థాన్ సొంతం చేసుకుంది. కొద్దిరోజుల క్రితమే చెన్నై వేదికగా ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన యూత్ టెస్టులో వైభవ్.. 62 బంతుల్లోనే శతకం బాది అంతర్జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.